ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రతలు | గరిష్ఠం : 38.0 | కనిష్ఠం : 26.0
ANDHRAJYOTHY
5
జోగుళాంబ
గద్వాల
జిల్లా వార్తలు
గురువారం 1 మే 2025



జోగుళాంబ దేవస్థానం అభివృద్ధికి సమగ్ర ప్రణాళిక అవసరం

» కలెక్టర్ బీఎం సంతోష్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బీఎం సంతోష్

గద్వాల న్యూటౌన్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ దేవస్థానం అభివృద్ధికి సమగ్ర ప్రణాళిక అవసరమని, దీంతో పాటు అన్ని అంశాలకు అంచనాలను సిద్ధం చేసి వాటిని కార్యరూపంలోకి తేవాలని కలెక్టర్ బీఎం సంతోష్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఐడీవోసీ వీడియో కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించిన సమీక్షా సమావేశంలో దేవస్థాన అభివృద్ధి కోసం ఏర్పాటు చేసిన పర్యవేక్షణ అభివృద్ధి కమిటీ సభ్యులతో కలెక్టర్ సమీక్షను నిర్వహించారు. ఈ సమావేశంలో ఆర్కిటెక్ట్ శ్రీలేఖ దేవస్థానం అభివృద్ధిపై పలు డిజైన్ ప్రతిపాదనలను ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జోగుళాంబ బాల బ్రహ్మేశ్వర స్వామి దేవస్థానాన్ని భక్తులకు ఆధునిక సౌకర్యాలతో పాటు పర్యాటకంగా అభివృద్ధి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. పుల్లూరు జంక్షన్, అలంపూర్ చౌరస్తాలో శక్తిపీఠం మాన్యుమెంట్‌ను రూపకల్పన చేసి తక్కువ నిర్వహణతో ఉండే ల్యాండ్‌స్కేపింగ్, రైలింగ్ కోసం అంచనాలను సిద్ధం చేయాలని సూచించారు. ఆలయానికి వెళ్లే రహదారి అభివృద్ధి, సంగమేశ్వర, పాపనాశిని ఆలయాలకు వెళ్లే అప్రోచ్ రోడ్లకు తగిన అంచనాలను సిద్ధం చేసి, నిర్మాణాన్ని దేవదాయ శాఖ ద్వారా అమలు చేయాలన్నారు. పచ్చదనం సంరక్షణకు నీటి సరఫరా, తాగునీటి ఏర్పాట్లను మునిసిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. ప్రతీ అంశానికి తగిన విధంగా ఖర్చు అంచనాలను సిద్ధం చేసి సంబంధిత శాఖలకు అందజేసి, వెంటనే అమలు ప్రక్రియను ప్రారంభించాలని ఆదేశించారు. అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ, ఆర్డీవో శ్రీనివాసరావు, ఆర్కిటెక్ సూర్యనారాయణమూర్తి, ఆర్కిటెక్ శ్రీలేఖ, కేంద్ర పురావస్తుశాఖ అధికారి రోహిణిపాండే, ఏడీ ఆర్కియాలజీ నాగలక్ష్మి, ఈవో పురేందర్, అధికారులు తదితరులు ఉన్నారు.

దేశానికే రోల్ మోడల్‌గా భూ భారతి

» 18 రాష్ట్రాల్లో అధ్యయనం చేసి ఈ చట్టాన్ని తెచ్చాం
» త్వరలో వీఆర్‌వోలు, వీఆర్‌ఏలను నియమిస్తాం
» రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి
» భూ భారతి అవగాహన సదస్సుకు హాజరైన మంత్రి జూపల్లి, ఎంపీ మల్లురవి, చిన్నారెడ్డి, ఎమ్మెల్యేలు మేఘారెడ్డి, రాజేశ్ రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

వనపర్తి, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అమలు చేస్తున్న భూ భారతి చట్టం దేశంలోనే రోల్ మోడల్‌గా నిలువనుందని రాష్ట్ర రెవెన్యూ గృహ నిర్మాణ సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం వనపర్తిలో ఏర్పాటు చేసిన భూ భారతి చట్టం అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వం తీసుకొచ్చిన ధరణితో భూ సమస్యలు పరిష్కారం కాకపోగా రైతులు నరకం అనుభవించారని మండిపడ్డారు. గత ప్రభుత్వ హయాంలో కేసీఆర్ ఏది చెబితే అదే చట్టంగా ఉండేదని అన్నారు. దొరగారు ధరణి పథకాన్ని భూ స్వాముల కోసం తెచ్చి వేల కోట్లు దోచుకున్నారని ఆరోపించారు. భూ భారతి చట్టం అలా కాకుండా పకడ్బందీగా పేదోడికి న్యాయం జరిగేలా రూపొందించినట్లు తెలిపారు. ఈ భూ భారతి చట్టం ద్వారా తహసీల్దార్, ఆర్డీవో , అడిషనల్ కలెక్టర్, కలెక్టర్, సీసీఎల్ ఇలా వివిధ స్థాయిల్లో భూ సమస్యలు పరిష్కారం అవుతాయని అన్నారు. ఆయా స్థాయిలో పరిష్కారం కాకపోతే స్పెషల్ ట్రిబ్యునల్ ప్రవేశ పెట్టడానికి చట్టంలో వెసులుబాటు కల్పించినట్లు తెలిపారు. రెవెన్యూ అధికారులు ఉద్దేశపూర్వకంగా తప్పులు చేస్తే ఈ చట్టం ద్వారా సదరు అధికారిపై చర్యలు తీసుకోవడానికి వీలుంటుందన్నారు. ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో ధరణి చట్టం ద్వారా ఎంతో మంది పెద్ద పెద్ద నాయకులు వేల భూములను వెనకేసుకున్నారని విమర్శించారు. అధికారంలోకి వచ్చిన 14 నెలల్లో పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అధ్యయనం చేసి ఈ చట్టాన్ని రూపొందించారని, ఇది రైతుల చుట్టమన్నారు.

ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి మాట్లాడుతూ.. భూములంటేనే ఇందిరమ్మ రాజ్యం గుర్తుకు వస్తుందని, నాడు ప్రధాన మంత్రి ఇందిరా గాంధీ పేదలకు భూమి పంచి పట్టాలిచ్చిందన్నారు. ఎంపీ మల్లు రవి మాట్లాడుతూ... ఒక్క రోజు బయటికి రాకుండా రాష్ట్రాన్ని అప్పులపాలు చేసి దివాల తీశాడని మండిపడ్డారు. నాలుగు కోట్ల ధనాన్ని నలుగురు దోచుకున్నారని విమర్శించారు. ధరణి పేరుతో రైతులను నానా ఇబ్బందులకు గురి చేశారని వారికి తగిన పాఠం చెప్పారని అన్నారు. ఎమ్మెల్యేలు మేఘారెడ్డి, రాజేశ్ రెడ్డి మాట్లాడుతూ... ధరణి చట్టంతో రాష్ట్రంలో ఉన్న గత ప్రభుత్వంలో ఉన్న పెద్దలు ఇక్కడ ఉన్న మన మాజీ నాయకుడు ఆ చట్టంలో ఉన్న లొసుగులతో పట్టాలు చేయించుకున్నారని మండిపడ్డారు. అందుకే ఆ నాయకుడికి నియోజకవర్గ ప్రజలు తగిన బుద్ధి చెప్పారని విమర్శించారు. అంతకుముందు జిల్లా కేంద్రంలో రూ.200 కోట్లకు సంబంధించిన పలు అభివృద్ధి పనులను వారు ప్రారంభించారు. స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివ సేనారెడ్డి, మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, కలెక్టర్ ఆదర్శ్ సురభి, డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డితదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్ల సమస్య పరిష్కరించాలి

» కలెక్టర్, అధికారుల ప్రత్యేక సమావేశంలో ఎమ్మెల్యే మేఘారెడ్డి

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

6

నేడు మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి రాక

» పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్టు పనులపై సమీక్ష

6

ధాన్యం కొనుగోలులో ప్రభుత్వ వైఫల్యం

● మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

6

కష్ట జీవులకు..

ఒంటిపూట పని!

» వేసవి నేపథ్యంలో ప్రభుత్వ నిర్ణయం
» పంచాయతీ కార్మికులకు ఉపశమనం

7

సమయానికి బస్సు ఆపి ఉంటే రెండు ప్రాణాలు దక్కేవి

» ఒకే కళాశాల ... రెండు చోట్ల చదువులు
» సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్ చాంబర్ ముందు నర్సింగ్ విద్యార్థుల బైఠాయింపు

7



గద్వాల కలెక్టర్ చాంబర్ ముందు బైఠాయించిన విద్యార్థినులు

91.74 శాతం

● పది ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో 26వ స్థానం సాధించిన గద్వాల

● ఉత్తీర్ణతలో బాలికలదే పైచేయి

గద్వాల సర్కిల్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): బుధవారం వెలువడిన పదో తరగతి పబ్లిక్ పరీక్షల ఫలితాల్లో జోగులాంబ గద్వాల జిల్లా 91.74శాతం సాధించి రాష్ట్రంలో 26వ స్థానంలో నిలిచింది. 7,569మంది విద్యార్థులు పరీక్షకు గానూ 6,944 మంది విద్యార్థులు హాజరైనట్లు ఇన్‌ఛార్జి డీఈవో అబ్దుల్ ఘని, ప్రభుత్వ పరీక్షల జిల్లా అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసులు తెలిపారు. ఫలితాల్లో బాలురకంటే బాలికలదే పైచేయిగా నిలిచింది. 3,810 మంది బాలికలు పరీక్షలకు హాజరుకాగా 93.96 శాతంతో 3,580మంది బాలికలు ఉత్తీర్ణత సాధించారు. 3,759 మంది బాలురు పరీక్షలకు హాజరవగా వారిలో 89.49 శాతంతో 3,364 మంది బాలురు ఉత్తీర్ణులయ్యారు. గతేడాదికంటే ఈసారి జిల్లా ఉత్తీర్ణత శాతం, స్థానంలోనూ సానుకూల ఫలితాలు సాధించింది. గత సంవత్సరం ఫలితాల్లో 81.38 శాతంతో రాష్ట్రంలో 32 స్థానంలో ఉన్న జిల్లా ఈఏడాది 91.74 (+10.36 శాతం పెరిగింది) శాతంతో 6స్థానాలు పైకి ఎగబాకి రాష్ట్రంలో 26వ స్థానంలో నిలిచింది.



గద్వాలలోని ప్రభుత్వ పాఠశాల పరీక్షా కేంద్రంలోకి వెళ్తున్న విద్యార్థులు (ఫైల్)

జిల్లాలో గత ఫలితాలు ఇలా..

సంవత్సరం	విద్యార్థుల హాజరు	ఉత్తీర్ణత	శాతం	రాష్ట్రంలో స్థానం
2021-22	7,920	6,783	85.64	31
2022-23	7,175	5,790	80.70	27
2023-24	7,175	5,839	81.38	32
2024-25	7,569	6,944	91.74	26

పంచవటి విద్యార్థుల ప్రభంజనం


విద్యార్థులను అభినందిస్తున్న పంచవటి పాఠశాల యజామాన్యం

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి పరీక్ష ఫలితాల్లో జిల్లా కేంద్రంలోని పంచవటి పాఠశాల విద్యార్థులు ప్రభజంనం సృష్టించారు. జి.ప్రణవి 590, అమోఘ్ జోషి 588, ఇస్రత్‌నాజ్ 587, ధనుష్‌తేజ 586, జాగృతి, సాయిశ్రీ, ఆయేషసిద్దిక 584, శ్రీనిధి, వసంత్‌గౌడ్, అఖిల, అజమ్ 583, ఆశ్లేష యాదవ్, శ్రీనిధి 582, రితీష్‌రెడ్డి, పార్థసారధి, తరుణ్‌కుమార్, సాహితి 581, సృజన 580 మార్కులు సాధించి ప్రభజనం సృష్టించారు. అదే విధంగా 46 మంది విద్యార్థులు 570 మార్కులు, 560 పైగా 78 మంది విద్యారులు, 550 పైగా 107 మంది విద్యార్థులు, 540 పైగా 136 మంది విద్యార్థులు, 530 పైగా 158 మంది విద్యార్థులు సాధించారని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్ టి.అనితరెడ్డి చైర్మన్ టి.శ్రీకాంత్‌రెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు.

న్యూరిషి జయకేతనం


న్యూ రిషి పాఠశాల విద్యార్థులు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని రాజేంద్రనగర్‌లో గల న్యూరిషి పాఠశాల విద్యార్థులు పది ఫలితాల్లో జయకేతనం ఎగురవేశారు. మూజఫర్ అలీఖాన్ 583, జి.హరికృష్ణ 582, చందన 578 సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థులను మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, పాఠశాల చైర్మన్ చంద్రకళ వెంకటయ్య, డైరెక్టర్ శిరీషపరీణ్‌కుమార్, పూజితమోహన్‌రెడ్డి, సాయిసుశాంత్‌కృష్ణ, ప్రిన్సిపాల్ వి.వెంకటరమణ విద్యార్థులను అభినందించారు.

రెయిన్‌బో విద్యార్థుల ప్రతిభ


మహమ్మద్ హుస్సేన్(575)

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి పరీక్ష ఫలితాల్లో మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని రెయిన్‌బో పాఠశాల విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించారు. మహమ్మద్ హుస్సేన్ 575, సామ్యూల్ విక్టర్ 572, మెహరీన్ ఫాతిమా 571 సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ మధుసూదన్‌రెడ్డి ప్రిన్సిపాల్ మమత, వైస్ ప్రిన్సిపాల్ నరేష్, ఉపాధ్యాయులు అభినందించారు.

ధాన్యం కొనుగోళ్ల సమస్య పరిష్కరించాలి

● కలెక్టర్, అధికారుల ప్రత్యేక సమావేశంలో ఎమ్మెల్యే మేఘారెడ్డి


కలెక్టర్ ఛాంబర్‌లో కలెక్టర్‌తో పాటు అధికారులతో సమావేశమైన ఎమ్మెల్యే మేఘారెడ్డి

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

వనపర్తి, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): రెండు రోజుల్లో ధాన్యం కొనుగోళ్ల సమస్యను పరిష్కరించాలని ఎమ్మెల్యే మేఘారెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో "ధాన్యా నికి చెదలు" అనే శీర్షికన వెలువడిన కథనానికి ఎమ్మెల్యే మేఘారెడ్డి కలెక్టర్ ఛాంబర్‌లో కలెక్టర్ ఆదర్శ్ సురభితో పాటు అధికారులతో ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. నియోజకవర్గ పరిధిలోని ధాన్యం కొనుగో లు కేంద్రాలలో నెలకొన్న సమస్యలను రెండు రోజుల్లో పూర్తిగా పరిష్కరిం చాలని రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఎమ్మెల్యే పేర్కొ న్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని గోదాంలలో దింపేందుకు ఇబ్బందులు ఉన్నాయంటూ రైతులు తమ దృష్టికి తీసుకువస్తున్నారన్నారు. లారీల సమ స్యను, గోదాంల వద్ద నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆయ న సూచించారు. ఆరుగాలం శ్రమించి పండించిన ధాన్యం విక్రయంలో రైతు లకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని, నిర్లక్ష్యం వహించే అధి కారులపై చర్యలు తీసుకోవాలని ఆయన కలెక్టర్‌కు సూచించారు. డీసీసీబీ అ. ధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి, జిల్లా అదనపు కలెక్టర్, జిల్లా సివిల్ సప్లయ్ అధి కారులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి

● ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి


పాట పాడుతున్న గాయకుడు ఏపూరి సోమన్న

వెల్దండ, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : రాజ్యాంగ నిర్మాత, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా, వెల్దండ మండల పరిధిలోని కొట్ర గ్రామంలో బుధవారం రాత్రి నిర్వహించిన అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి, విద్యా కమిషన్ సభ్యుడు చారకొండ వెంకటేశ్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యుడు బాలాజీసింగ్, గాయకుడు వేపూరి సోమన్నలతో కలిసి విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ యువత అంబేడ్కర్ బాటలో నడవాలన్నారు. కార్యక్రమంలో అంబేడ్కర్ యువజనసంఘం సభ్యులు మల్లేశ్, వెంకట్, నాయకులు రవీందర్‌రావు, వెంకటయ్యగౌడ్, భూపతిరెడ్డి, కేశమల్ల కృష్ణ, బ్రహ్మయ్య, ఈశ్వరయ్య, పరశురాములు ఉన్నారు.

భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం

● ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు


కొల్లాపూర్‌లో భూ భారతి చట్టంపై రైతులకు అవగాహన కల్పిస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు


అవగాహన సదస్సుకు హాజరైన రైతులు, మహిళలు, నాయకులు

కొల్లాపూర్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): భూ భారతి చట్టంతో భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం దక్కుతుందని రైతుల భూ సమస్యలను రెవెన్యూ అధికారులు న్యాయంగా పరిష్కరించాలని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదేశించారు. బుధవారం కొల్లాపూర్ పట్టణంలోని వాసవీ కల్యాణ మండపంలో నిర్వహించిన భూ భారతి చట్టం అవగాహన సదస్సులో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ధరణి ద్వారా పరిష్కారం కాని భూ సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వ భూ భారతిని అమలులోకి తీసుకువచ్చిందన్నారు. నియోజకవర్గంలోని రైతులు తమ భూ సమస్యల దరఖాస్తులను తహసీల్దార్ కార్యాలయాలలో సమర్పించిన అనంతరం రసీదులు పొంది తన వాట్సాప్ నెంబర్‌కు పంపాలన్నారు. ప్రతీ రోజు వచ్చిన దరఖాస్తులను ప్రింట్ తీసుకుని అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మంత్రి తెలిపారు. కలెక్టర్ మాట్లాడుతూ.. ఈ చట్టం గురించి ప్రజలకు అవగాహన కల్పించడానికి ప్రతి మండల కేంద్రంలో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని అన్నారు. వారసత్వంగా వచ్చిన భూములకు మ్యుటేషన్ చేసే ముందు నిర్ణీత కాలంలో విచారణ, పాసు పుస్తకాలలో భూమి పటం, భూముల సమస్యలు పరిష్కారానికి రెండంచెల అప్పీలు వ్యవస్థ ఉంటుందని జిల్లా కలెక్టర్ తెలిపారు. తహసీల్దార్ చేసిన మ్యుటేషన్‌లపై లేదా జారీ చేసిన పాసు పుస్తకాలపై అభ్యంతరాలు ఉంటే ఆర్డీవోకు అప్పీలు చేసుకోవచ్చని సూచించారు. కలెక్టర్ ఇచ్చిన తీర్పుపై అభ్యంతరం ఉంటే భూమి ట్రిబ్యునల్ కు కూడా అప్పీలు చేసుకోవచ్చని అన్నారు. అప్పీలు చేసుకున్న పేద రైతులకు ఉచిత న్యాయ సహాయం అందిస్తారని జిల్లా కలెక్టర్ తెలిపారు.

భూముల కొనుగోలు, దానం, తనఖా, బదిలీ, భాగ పంపకాలకు సంబంధించి స్లాట్ బుక్ చేసుకుని తహసీల్దార్ కార్యాలయానికి వెళ్తే అసైన్డ్ , పీవోటి ప్రభుత్వ భూములు కావని నిర్ధారించుకున్న మీదట గడువు లోపు రిజిస్ట్రేషన్ చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ తెలిపారు. వారసత్వ వీలునామా కింద కూడా మ్యుటేషన్ చేసే అధికారాలను తహసీల్దార్లకు కల్పించారని అన్నారు. అయితే క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ జరిపిన మీదట వారసత్వ వీలునామా రిజిస్ట్రేషన్ చేస్తారని సూచించారు. భూ వివాదాల సత్వర పరిష్కారం కోసం భూ భారతి ద్వారా ఇది వరకటి తరహాలోనే రెవెన్యూ కోర్టులను పునరుద్ధరించారని తెలిపారు. భూములకు సంబంధించిన సమగ్ర వివరాలు, హద్దులతో పట్టా పాస్ బుక్కులకు మ్యాప్‌లను జత చేస్తారని అన్నారు. లైసెన్స్‌డ్ సర్వేయర్‌తో సర్వే చేయించి సమర్పించే మ్యాప్‌లను పరిశీలించి, పట్టా పాస్ పుస్తకంలో నమోదు చేయనున్నట్లు తెలిపారు. ఈ అవగాహన సదస్సుకు ఆర్డీవో భన్సీలాల్, తహసీల్దార్ మురళీధర్ రావు, వ్యవసాయ శాఖ అధికారి చిన్న హుస్సేన్ యాదవ్, డీఎస్పీ శ్రీనివాస్, రెవెన్యూ సిబ్బంది గ్రామస్తులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ ఉద్యోగికి ఉద్యోగ విరమణ తప్పదు

● మహబూబ్‌నగర్ జిల్లా ఎస్పీ జానకి


ఉద్యోగ విరమణ పొందిన ఎస్ఐ భవనయ్యను సన్మానిస్తున్న ఎస్పీ జానకి

మహబూబ్‌నగర్, ఏప్రిల్, 30 (ఆంధ్రజ్యోతి) : ప్రతీ ఉద్యోగికి ఉద్యోగ విరమణ తప్పదని మహబూబ్‌నగర్ జిల్లా ఎస్పీ డీ జానకి అన్నారు. ఉమ్మడి జిల్లా పరిధిలో ఎస్ఐగా పని చేసిన భవనయ్య, రహెమాన్‌లతో పాటు మరో ఇద్దరు బుధవారం ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమంలో వారిని ఎస్పీ ఘనంగా సన్మానించారు. అనంతరం మాట్లాడుతూ విధి నిర్వహణలో చేసిన సేవలే ఉద్యోగికి గుర్తింపు తెస్తాయన్నారు. ఉద్యోగ విరమణ చేసిన నలుగురు సుదీర్ఘకాలం అందించిన సేవలను మరువలేమన్నారు. పోలీసు శాఖలో ఎన్నో ఒత్తిడుల మధ్య విధులు నిర్వర్తించి, శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేశారన్నారు. శేష జీవతాన్ని కుటుంబసభ్యులతో ప్రశాంతంగా, సుఖసంతోషాలతో గడ పాలని ఆకాంక్షించారు. వారికి ప్రభుత్వం నుంచి రావలిసిన ఆర్థిక ప్రయోజనాలను త్వరితగ తిన అందించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఏవో రుక్మిణి, ఆర్ఐ కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

బాస్కెట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర చైర్మన్‌గా మక్సూద్‌బిన్ జాకీర్


మక్సూద్‌బిన్ జాకీర్

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ఫుట్‌బాల్ అసోసియేషన్ చైర్మన్‌గా మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రానికి చెందిన మక్సూద్‌బిన్ జాకీర్ ఎన్నికయ్యారు. హైదరా బాద్‌లోని ఒలింపిక్ భవన్‌లో జరిగిన ఈసీ సమావేశంలో రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు శ్రీధర్‌రెడ్డి, పృథ్వీరెడ్డి, అసోసియేషన్ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జాకీర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాస్కెట్‌బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ప్రతినిధులు, రాష్ట్ర ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా అసోసియేషన్ ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.

బీఆర్‌ఎస్‌ది గోబెల్ ప్రచారం

● ఆ నలుగురితోనే తెలంగాణ ఆగం ● ఎంపీ మల్లు రవి ధ్వజం


విలేకరులతో మాట్లాడుతున్న ఎంపీ మల్లు రవి

నాగర్‌కర్నూల్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : భారత రాష్ట్ర సమితి పదేళ్ల దుష్పరిపాలనతో తెలంగాణ రాష్ట్రం ఆగమైందని నాగర్‌క ర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లు రవి దుయ్యబట్టారు. మాజీ ముఖ్య మంత్రి కేసీఆర్‌కు దమ్ముంటే ఆయన హయాంలో తెలంగాణకు ఆర్థిక స్థితిగతుల మీద శ్వేతపత్రం విడుదల చేయాలని సవాలు విసిరారు. బుధవారం మధ్యాహ్నం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు, కవితలపై ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో బంగారు తెలంగాణ పేరు చెప్పి ఆ కుటంబమే బాగుపడిందని, పదేళ్లలో ఒక నిరుపేద కుటుంబానికి అయినా డబుల్ బెడ్రూం ఇచ్చారా అని మల్లు రవి ప్రశ్నించారు. ఎన్నికల హామీలో పేర్కొనకపోయినప్పటికీ రేవంత్‌రెడ్డి ప్రభుత్వం సన్నబియ్యం అందిస్తుందని, రూ.6 వేల కోట్లు రాజీవ్ యువ వికాసం పేరిట స్వయం ఉపాధి పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కిందన్నారు. విలేకరుల సమావేశంలో స్థానిక ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి, మార్కెట్ చైర్మన్ రమణారావు, కాంగ్రెస్ నాయకులు హబీబ్, కోటయ్య, కావలి శ్రీనివాసులు, నిజాం, కొలను వల్లభ్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి రాక

● పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్టు పనులపై సమీక్ష


నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి

కొల్లాపూర్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): కొల్లాపూర్ నియోజకవర్గ కేంద్రానికి గురువారం రాష్ట్ర భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, రాష్ట్ర పర్యాటక ఎక్సైజ్, సాంస్కృతిక పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు రానున్నారు. కొల్లాపూర్ మండల పరిధిలోని నార్లాపూర్ గ్రామంలో పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్టు పనులపై ఉన్నత అధికారులతో సమీక్ష నిర్వహించేందుకు పను లు పరిశీలించేందుకు గురువారం ఉదయం 9:45 గంటలకు హెలికాప్టర్ ద్వారా ప్రాజెక్టు ప్రదేశానికి చేరుకోనున్నారు. పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్టులో ప్రధాన భాగమైన నార్లాపూర్ రిజర్వాయర్ ప్రాజెక్టు స్టేజీ వన్ పంపింగ్ స్టేషన్ నార్లాపూర్ రిజర్వాయర్ ప్యాకేజీ 2 ఓపెన్ కెనాల్ పనులను పరిశీలించనున్నారు. అక్కడి నుంచి వనపర్తి జిల్లా రేవల్లి మండలం ఏదుల రిజర్వాయర్ పనులను పరిశీలించేందుకు వెళ్తారు. అక్కడి నుంచి కోడేరు మండలం తీగలపల్లి గ్రామంలో పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్టు పంపింగ్ స్టేషన్ పనులు పరిశీలిస్తారు. సాయంత్రం 4:40 గంటలకు నాగర్‌కర్నూల్ జిల్లా ఉయ్యాలవాడ గ్రామంలో కొనసాగుతున్న ప్రాజెక్టు పనులను పరిశీలించి అక్కడి నుంచి పరిశీలించిన పనులపై అధికారులతో సమీక్ష నిర్వహిస్తారు.

ధాన్యం కొనుగోలులో ప్రభుత్వ వైఫల్యం

● మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి


మాట్లాడుతున్న నిరంజన్‌రెడ్డి

వనపర్తి, ఏప్రిల్ 30(ఆంధ్ర జ్యోతి): యాసంగి ధాన్యం కొనుగోలులో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి మండిపడ్డారు. బుధవారం వనపర్తి జిల్లా కేంద్రంలోని తన నివాసంలో మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రైతుల పరిస్థితి హృదయ విదారకంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. సకాలంలో సాగునీరు కరెంటు లేకుండా కష్టపడి పండించుకున్న ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువస్తే నెలల తరబడి వేచి చూడాల్సి వస్తుందని అన్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని కూడా కల్లాల్లోనే వారాల పాటు పెట్టడం వలన చెదలు పడుతుందని అన్నారు. యాసంగి పంటలో ఎటువంటి తేమ గాని, తాలు గాని ఉండదని, కుంటి సాకులు చెప్పి రైతులను గన్నీ బ్యాగులు, లారీలు లేక ఇబ్బందులకు గురి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు హెచ్చరించారు. ఈ విషయంపై మంత్రులు, అధికారులు వెంటనే స్పందించి సకాలంలో ధాన్యం కొనుగోలు చేయాలని లేని పక్షంలో ప్రభుత్వంపై తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు. సమావేశంలో గట్టు యాదవ్, అశోక్, ఇమ్రాన్, నారాయణ నాయక్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

పెరిగిన ఎండల తీవ్రత

వనపర్తి, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా వ్యాప్తంగా బుధవారం ఎండ తీవ్రత పెరిగింది. ఉదయం 9 గంటల నుంచే ఎండలు దంచి కొడుతున్నాయి. బయటికి రావాలంటే ప్రజలు జంకుతున్నా రు. జోగుళాంబ గద్వాల జిల్లాలో 43.1 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత, 27.4 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. వనపర్తి జిల్లా కొత్తకోట మండలంలో అత్యధికంగా 41.4 డిగ్రీలు, మహబూబ్‌నగర్ జిల్లాలో గరిష్ఠం 40.9, కనిష్ఠం 27.1, నారాయణపేట జిల్లాలో గరిష్ఠం 38, కనిష్ఠం 27 డిఢ్రీలు, నాగర్‌కర్నూల్ జిల్లాలో గరిష్ఠం 38 డిగ్రీలు, కనిష్ఠం 26 డిగ్రీలు నమోదైంది.

తాళం వేసిన ఇంట్లో చోరీ

రాజాపూర్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా, రాజాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని చిన్నరేవల్లిలో తాళం వేసిన ఓ ఇంట్లో చోరీ జరిగింది. రాజాపూర్ ఎస్ఐ శివానందం తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన నాగేశ్వర్‌జీ, సక్కుబాయి దంపతులు సోమవారం ఉదయం ఇంటికి తాళం వేసి బాలానగర్‌లో ఉంటున్న తన కుమారుడి దగ్గరకు వెళ్లారు. బుధవారం ఉదయం వారి ఇంటి తాళం పగులగొట్టి ఉండటాన్ని సమీపంలో నివసించే బంధువులు చూసి వారికి ఫోన్ చేసి చెప్పారు. దీంతో వారు వెంటనే ఇంటికి చేరుకొని పరిశీలించారు. బీరువా, ఇనుపపెట్టె తాళాలు పగులగొట్టి, 12 గ్రాముల బంగారం, 20 తులాల వెండితో పాటు కొంత నగదు చోరీకి గురైనట్లు గుర్తించారు. సంఘటనపై బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.


జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌లో వర్షానికి తడువకుండా ధాన్యంపై కప్పిన టార్పాలిన్ కవర్లు


జిల్లా కేంద్రంలో జలమయమైన ప్రధాన రహదారి


జూపల్లిలో రోడ్డుకు అడ్డంగా విరిగి పడ్డ చెట్టు

ఉదయం ఎండ.. సాయంత్రం వాన

● నాగర్‌కర్నూల్ జిల్లాలో ఓ మోస్తరు వర్షం
● జిల్లా కేంద్రంలో రహదారులు జలమయం
● మార్కెట్ యార్డులో తడిసిన ధాన్యం
● ఊర్కొండ, కొత్తూరులలో వడగండ్లు
● అచ్చంపేట మండలంలో విరిగిన చెట్లు, తెగిన విద్యుత్ తీగలు


గోకారంలో గాలి వానకు రేకులు ఎగిరిపోయిన ఇంటి పైకప్పు

నాగర్‌కర్నూల్ టౌన్/ కల్వకుర్తి/ అమ్రాబాద్/ ఊర్కొండ/ మిడ్జిల్/ అచ్చంపేట/ ఉప్పునుంతల, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : ఉదయం ఎండ తీవ్రంగా ఉంటోంది. మధ్యాహ్నం 3 గంటల తర్వాత వాతావరణం చల్లబడి సాయంత్రం వర్షం కురుస్తోంది. గత వారం రోజులుగా ఇదే పరిస్థితి కొనసాగుతోంది. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో బుధవారం మధ్యాహ్నం మోస్తరు వర్షం కురిసింది. అరగంట పాటు ఉరుములు, మెరుపులతో కురిసిన వానకు రహదారులు జలమయమయ్యాయి. వ్యవసాయ మార్కెట్‌లో విక్రయానికి రైతులు తెచ్చిన ధాన్యం, మొక్కజొన్న కొంతమేర తడిసిపోయింది. ఆరబోసిన ధాన్యాన్ని రైతులు హడావిడిగా సంచుల్లో నింపుకొని టార్పాలిన్లు కప్పారు.

● కల్వకుర్తి పట్టణంతో పాటు మండలంలోని మార్చాల, యంగం పల్లి, కుర్మిద్ద గ్రామాల్లో వర్షం పడింది.

● అమ్రాబాద్ మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో అర గంట పాటు వర్షం కురిసింది. మండల కేంద్రంలో వడగండ్లు పడి వరి పంట స్వల్పంగా దెబ్బతిన్నట్లు రైతులు తెలిపారు.

● ఊర్కొండ మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం సాయంత్రం వడగండ్ల వానపడింది. దీంతో వరి పంటకు నష్టం వాటిల్లింది. పొలాల్లోని కల్లాలతో పాటు, కొనుగోలు కేంద్రంలో ధాన్యం తడిసింది.

● అచ్చంపేట పట్టణంలో గాలి దుమారంతో భారీ వర్షం కురిసింది. దుకాణ సముదాయాల ముందున్న బోర్డులు కిందపడిపోయాయి. బొడ్రాయి పండుగ కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ లైటింగ్ బోర్డులు కూలిపోయాయి. దీంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. మన్నెవారిపల్లి వద్ద ఎస్ఎల్‌బీసీ సమీపంలో పిడుగు పాటుతో జక్కుల సాయిలుకు చెందిన 25 గొర్రెలు చనిపోయాయి. ఉప్పునుంతల మండలం వెలటూరు సమీపంలో విద్యుత్తు స్తంభాలు నేలకొరిగాయి. కొరటికల్ గ్రామంలో వరి పంటలు దెబ్బతిన్నాయి.

● ఉప్పునుంతల మండల పరిధిలోని దాసర్లపల్లిలో పిడుగు పడి ఓ ఆవు మృతి చెందింది. గ్రామానికి చెందిన కుందేటి హుస్సేన్ అనే రైతు తన పొలంలో ఆవులను కట్టేశాడు. బుధవారం మధ్యాహ్నం ఈదురు గాలులలతో కూడిన భారీ వర్షం కురిసి, పిడుగు పడటంతో ఆవు చనిపోయింది. దాని విలువ రూ.50 వేలు ఉంటుందని, బాధితుడు తెలిపారు.

● మహబూబ్‌నగర్ జిల్లా, మిడ్జిల్ మండలంలోని కొత్తూరులో వడగళ్ల వానకు వంద ఎకరాలకు పైగా వరి పైరు నేలవాలింది. కోతదశలో వడగండ్లు పడటంతో వడ్లు రాలిపోయాయని రైతులు తెలిపారు. దెబ్బతిన్న పంటలను పరిశీలించి నివేదికను రూపొందించి జిల్లా అధికారులకు పంపించనున్నట్లు మండల వ్యవసాయాధికారి సిద్ధార్థ తెలిపారు.

● చారకొండ మండల కేంద్రంమైన చారకొండతో పాటు, మండలంలోని మర్రిపల్లి, జూపల్లి, తుర్కలపల్లి, గోకారం, చంద్రాయణపల్లి, సిరసనగండ్ల తదితర గ్రామాల్లో ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. గోకారం గ్రామంలో కొండ్రెడ్డి పాపయ్యకు చెందిన ఇంటి పైకప్పు రేకులు ఎగిరిపోయాయి. జూపల్లిలో చెట్లు విరిగి రహదారికి అడ్డంగా పడ్డాయి. 11 కేవీ విద్యుత్ స్తంభం విరిగి పడింది. కొత్తది ఏర్పాటు చేస్తామని ఏఈ జానకీరాం తెలిపారు.

క్రైం కార్నర్

లారీ, కారు, డీసీఎం ఢీ

▸ ఓ మహిళ దుర్మరణం, నలుగురికి గాయాలు



నుజ్జునుజ్జయిన కారును పక్కకు తీస్తున్న స్థానికులు



ప్రమాదంలో మృతి చెందిన శోభారాణి (ఫైల్)

మూసాపేట, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : స్కూటీని తప్పించబోయి ఓ కారు ముందు వెళ్తున్న డీసీఎంను ఢీకొన్నది. ఆ కారును వెనుక నుంచి వస్తున్న లారీ ఢీకొన్నది. ప్రమాదంలో ఓ మహిళ దుర్మరణం చెందింది. మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. మహబూబ్‌నగర్ జిల్లా, మూసాపేట మండలంలో బుధవారం ఉదయం ఈ సంఘటన జరిగింది. అడ్డాకుల ఎస్ఐ ఎం.శ్రీనివాస్ కథనం ప్రకారం.. వనపర్తి జిల్లా కొత్తకోట మండలం, సంకిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఎల్లారెడ్డి కుటుంబసభ్యులతో కలిసి కారులో హైదరాబాద్‌కు బయలు దేరారు. అడ్డాకుల మండలం కందూరు స్టేజీ వద్దనున్న వంతెనపై ముం దు వెళ్తున్న డీసీఎంకు ఓ స్కూటీ హఠాత్తుగా అడ్డురావడంతో డ్రైవర్ సడన్ బ్రేక్ వేశాడు. దీంతో దాని వెనుక వస్తున్న కారు డీసీఎంను ఢీకొ న్నది. అదే సమయంలో వెనుక నుంచి వచ్చిన లారీ ఆ కారును ఢీకొనడం తో నుజ్జునుజ్జయ్యింది. కారులో ప్రయాణిస్తున్న శోభారాణి (50) తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందింది. అదే కారులో ఉన్న ఎల్లారెడ్డి, విమల, డ్రైవర్ రవీందర్‌తో పాటు స్కూటీపై వస్తున్న కొమిరెడ్డిపల్లికి చెందిన రఘుపతిరెడ్డి తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. పూర్తిగా దెబ్బతిన్న కారులో నుంచి క్షతగాత్రులను వెలికి తీసి అంబులెన్సులో జిల్లా ఆసుపత్రికి తరలించారు. రఘుపతిరెడ్డి కందూరు సాయిబాబా గుడికి వెళ్లి దర్శనం చేసుకొని తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ప్రమాదం జరిగినప్పుడు వాహనాలు రహదారికి అ డ్డంగా పడటంతో కొద్దిసేపు రాకపోకలకు ఆటంకం కలిగింది. సంఘటనపై కేసు నమోదు చేసుకొని, విచారణ చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

కుటుంబ పోషణ భారమై యువకుడి ఆత్మహత్య



జింకల లక్ష్మణ్ (ఫైల్)

చారకొండ, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : ఆర్థిక ఇబ్బందులతో కుటుంబ పోషణ భారమై ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. నాగర్‌కర్నూల్ జిల్లా, చారకొండ మండలంలో ఈ సంఘటన జరిగింది. చారకొండ ఎస్ఐ శంషుద్దీన్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని సిరసనగండ్ల గ్రామానికి చెందిన జింకల లక్ష్మణ్ (26) గతంలో ఓ రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. అప్పటి నుంచి పలు అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. దానికి తోడు ఆర్థిక ఇబ్బందులతో కుటుంబ పోషణ భారమైంది. దీంతో మనస్తాపానికి గురైన అతడు మంగళవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. అతడికి భార్య అని త, కుమారుడు, కూతురు ఉన్నారు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తండ్రి జింకల సాలయ్య ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

ఆటోలో నుంచి జారి పడిన బాలిక

▸ కంటైనర్ లారీ కింద పడి మృతి



బాలిక మృతదేహం వద్ద రోదిస్తున్న తల్లి, చెల్లి

కృష్ణ, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : ప్రమాదవశాత్తు ఆటోలో నుంచి జారి పడిన ఓ బాలిక మీద నుంచి కంటైనర్ లారీ వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందింది. నారాయణపేట జిల్లా, కృష్ణ మండల పరిధిలోని గుడెబల్లూరు శివారులోని 167వ నెంబర్ జాతీయ రహదారిపై బుధవారం జరిగింది. ప్రత్యక్ష స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... మక్తల్ నియోజకవర్గం, ఊట్కూర్ మండలం మల్లేపల్లి గ్రామానికి చెందిన లోకపల్లి వెంకటమ్మ, ఆమె కుమార్తెలు లోకపల్లి నందిని, మానస కలిసి కర్ణాటక రాష్ట్రం కడేచూరు గ్రామంలోని బంధువుల ఇంట్లో మారెమ్మ గుడి పూజకు వెళ్లారు. తిరిగి స్వగ్రామానికి వచ్చేందుకు టైరోడ్డు వద్ద ఆటో ఎ క్కారు. ఆటోలో వెనుక కూర్చొన్న నందిని (16) ప్రమాదవశాత్తు జారి కింద పడిపోయింది. అదే సమయంలో రాయచూరు నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న కంటైనర్ లారీ నందిని కడుపు మీదుగా వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందింది. ఈ విషయంపై స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. అప్పటికే సమీపంలో ఉన్న ఎస్ఐ నవీద్ వెంటనే సంఘట నా స్థలానికి చేరుకున్నారు. బాలిక మృతదేహాన్ని అంబులెన్స్ ద్వారా మ క్తల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. నందిని తల్లి లోకపల్లి వెంకటమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నవీద్ తెలిపారు.

మహిళ అదృశ్యం

కోయిలకొండ, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా, కోయిలకొండ మండల కేంద్రానికి చెందిన గద్దం బాలకిష్టమ్మ (52) అదృశ్యం అయ్యిందని ఎస్ఐ భాస్కర్‌రెడ్డి తెలిపా రు. హైదరాబాదులో ఉన్న కుమార్తె వద్దకు వెళ్తానని ఈ నెల 27న ఆమె ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఆ తర్వాత కుటుంబ సభ్యులు కుమార్తెకు ఫోన్ చేయగా, ఆమె రాలేదని చెప్పారు. దీంతో భర్త చాకలి గద్దం వీరన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ద్విచక్రవాహనం, వ్యాను ఢీకొని వ్యక్తి మృతి

హన్వాడ, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : ద్విచక్రవాహనం, బొలెరో ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. మహబూబ్‌నగర్ జిల్లా, ఇబ్రహీంబాద్ సమీపంలో బుధవారం ఈ సంఘటన జరిగింది. ఎస్ఐ వెంకటేశ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి..

దౌల్తాబాద్ మండలంలోని యామ్కి గ్రామానికి చెందిన మౌలాలీసాబ్ (53) ద్విచక్రవాహనం (టీవీఎస్)పై మహబూబ్‌నగర్‌కు వ స్తుండగా, ఇబ్రహీంబాద్ సమీపంలో నిర్మాణంలో ఉన్న బ్రిడ్జి వద్ద ఎదు రుగా వస్తున్న బలెరో వ్యాను ఢీకొన్నది. దీంతో తీవ్రంగా గాయపడిన మౌలాలిని స్థానికులు అంబులెన్స్‌లో జిల్లా ఆసుపత్రికి తరలించగా, కొద్ది సేపటికే మృతి చెందాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

▸ వేసవి నేపథ్యంలో ప్రభుత్వ నిర్ణయం
▸ పంచాయతీ కార్మికులకు ఉపశమనం

కష్ట జీవులకు.. ఒంటి పూట పని!



కేటీదొడ్డి మండలం, గువ్వల దిన్నెలో పనులు చేస్తున్న పారిశుధ్య కార్మికులు (ఫైల్)



అయిజ మండలం, ఉప్పలలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు

అయిజ టౌన్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయతీ కార్మికులకు ప్రభుత్వం ఒంటి పూట పనిచేసే వెసలుబాటు కల్పించింది. ఈ మేరకు ఈ నెల 22న రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ నుంచి ఆయా జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు జారీ అయ్యాయి. ఈ నెలలో ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నది. ప్రతీ రోజు ఉదయం నాలుగు గంటలకే పని మొదలుపెట్టే పారిశుధ్య కార్మికులు మధ్యాహ్నం 12 గంటల వరకూ పూర్తి కాని పరిస్థితులున్నాయి. అసలే ఎండలు తీవ్రంగా ఉండటంతో కార్మికులు ఒంట్లో సత్తువ కోల్పోతున్నారు. వారిలో కొందరు అల్పాహారం కూడా చేయకుండా పని చేస్తుండటంతో వడదెబ్బకు గురవుతున్నారు. దీంతో ఉదయం 11 గంటల వరకే పనులు చేయాలని అధికారులు కార్మికులకు సూచిస్తున్నారు. తప్పనిసరిగా పని అయితే సాయంత్రం 5 నుంచి 6 గంటల లోపు పూర్తి చేయించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ఒంటిపూట పని విధానాన్ని ప్రకటించడంతో పారిశుధ్య కార్మికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

జోగుళాంబ గద్వాల జిల్లాలో ఇలా...

ప్రతీ గ్రామానికి జనాభా ప్రాతిపదికన పారిశుధ్య కార్మికులను ఎనిమిదేళ్ల క్రితం అప్పటి ప్రభుత్వం నియమించింది. 500 జనాభాకు ఒక్కరు చొప్పున జోగుళాంబ గద్వాల జిల్లాలోని 14 మండలాల్లో 962 మంది కార్మికులను నియమించింది. వారంతా గ్రామపంచాయతీలో మల్టీపర్పస్ వర్కర్లుగా అన్ని రకాల పనులు చేస్తున్నారు. పారిశుధ్యం, తాగునీటి సరఫరా, ఇళ్ల నుంచి చెత్త సేకరణ, డంపింగ్ యార్డులకు తరలింపు, హరితహారం మొక్కలకు నీరు పట్టడం, తొట్లలో నీరు నింపడం, బ్లీచింగ్ పౌడర్ చల్లటం, నీటి ట్యాంకులను శుభ్రం చేయడం తదితర పనులన్నీ చేస్తున్నారు.



ఉదయం 4 గంటల నుంచి...

ప్రతీ రోజు తెల్లవారుజామున 4 గంటలకే గ్రామంలో పారిశుధ్య పనులు మొదలుపెడతాం. కొన్ని సార్లు మధ్యాహ్నం పన్నెండు గంటలు దాటినా పనులు పూర్తి కావు. పారిశుధ్య పనులు చేస్తున్నప్పుడు మధ్యలో టిఫిన్ చేయడం ఇష్టం ఉండదు. ఎండలకు దాహం ఎక్కువ అవుతుండటంతో నీరు మాత్రమే తాగుతూ పని చేస్తుంటాం. దీంతో ఎక్కువగా అలసిపోతున్నాం. అస్వస్థతకు గురవుతున్నాం. వేసవి ముగిసే వరకు ఒంటి పూట పని విధానాన్ని ప్రభుత్వం ప్రకటించడం చాలా సంతోషంగా ఉంది.

- బాలప్ప, పారిశుధ్య కార్మికుడు, గువ్వలదిన్నె (కేటీదొడ్డి)



ఎవరూ పట్టించుకునే వారు కాదు

మేము ఎన్ని గంటలు పనిచేసినా మమ్మల్ని ఎవ్వరు పట్టించుకునే వారు కాదు. కనీసం ఎండలు మండుతున్నాయి పనులు ఆపండి అని ఎవరూ చెప్పలేదు. ఎండల్లో పని చేస్తూ కార్మికులు స్పృహతప్పి పడిపోయిన సంఘటనలు కూడా ఉన్నాయి. ప్రభుత్వం మా ఇబ్బందులను అర్థం చేసుకుని ఒంటి పూట పనులు కల్పించటం ఆనందంగా ఉంది.

- రాజు, పారిశుధ్య కార్మికుడు, ఎక్లాస్‌పురం, (అయిజ)




ఆదేశాలు జారీ చేశాం

ప్రభుత్వ ఆదేశం మేరకు పారిశుధ్య కార్మికులతో ఒంటి పూట పని చేయించుకోవాలని పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేశాం. ఎండలు ముదురుతుండటంతో కార్మికులు పడుతున్న ఇబ్బందులను పంచాయతీ కార్యదర్శులు మా దృష్టికి తీసుకొచ్చారు. అందుకు స్పందించిన ప్రభుత్వం మానవతా దృక్పథంతో ఆలోచించి కార్మికులకు ఒంటి పూట పని చేసే వెసలుబాటు కల్పించింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు పనులు చేయిస్త గ్రామాలను పరిశుభ్రంగా ఉంచేందుకు చర్యలు తీసుకుంటాం.

- నాగేంద్రం, ఇన్‌చార్జి డీపీవో, గద్వాల

ఆధ్యాత్మిక విలువలతో కుటుంబ జీవనం



లక్ష్మీ వేంకటేశ్వర స్వామికి అభిషేకం నిర్వహిస్తున్న స్వామీజీ



మహా పల్లకి సేవలో పాల్గొన్న భక్తులు

▸ బాళగారు మఠం పీఠాధిపతి అక్షోభ్య రామప్రియతీర్థ స్వామీజీ
▸ నరసాచల క్షేత్రంలో కొనసాగుతున్న స్వర్ణోత్సవాలు

నారాయణపేట రూరల్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : ఆధ్యాత్మిక విలువలతో కూడిన కుటుంబ జీవనం గొప్పదని బాళగారు మఠం పీఠాధిపతి అక్షోభ్య రామప్రియతీర్థ స్వామీజీ అన్నారు. నారాయణపేట జిల్లా, కోటకొండ నరసాచల వేంకటేశ్వర స్వామి ఆలయంలో స్వర్ణోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. అందులో భాగంగా బుధవారం అక్షత తృతీయ పర్వదినాన్ని పురస్కరించుకుని స్వామివారికి పంచామృతాభిషేకం, కుంభాభిషేకం నిర్వహించారు. అనంతరం మూల రాముల సంస్థాన పూజలు చేశారు. ఈ సందర్భంగా స్వామీజీ మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ నిత్య జీవితంలో కొంత సమయమైనా ఆధ్యాత్మిక చింతనలో ఉండాలన్నారు. భగవంతుడిని సేవిస్తూ సన్మార్గంలో నడవాలని సూచించారు. భాగవత సప్తాహంలో భాగంగా విద్వాన్ తుప్పసక్కిరి ప్రహ్లాదాచార్యులు నాలుగో స్కంద సారాన్ని భక్తులకు వివరించారు. అనంతరం స్వామి వారికి మహారథోత్సవం, పల్లకీ సేవలను కనుల పండువగా నిర్వహించారు. కార్యక్రమంలో గోవింద తీర్థ స్వాములు, పేట శక్తిపీఠం వ్యవస్థాపకుడు శాంతానంద పురోహిత్, నరసాచల సేవాసమితి సభ్యులు సీతారామారావు, జనార్దన్‌రావు, ప్రభంజన్‌రావు, జయతీర్థాచారి, శ్రీపాద్, శ్రీనివాస్, భీంసేనాచారి, హన్మేశ్, ప్రకాశ్, శేషు పాల్గొన్నారు.

ముగిసిన కాంట్రాక్ట్ అధ్యాపకుల సమ్మె



అధ్యాపకులకు నిమ్మరసం ఇచ్చి సమ్మెను విరమింప జేస్తున్న పాలమూరు యూనివర్సిటీ అధికారులు డాక్టర్ చంద్రకిరణ్, డాక్టర్ కృష్ణయ్య

పాలమూరు యూనివర్సిటీ, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : ఉద్యోగాలకు క్రమబద్ధీకరించాలని 10 రోజులుగా చేస్తున్న నిరవధిక సమ్మెను కాంట్రాక్టర్ అధ్యాపకులు బుధవారం విరమించారు. రాష్ట్రంలోని 12 యూనివర్సిటీల్లో పని చేస్తున్న 1,445 మంది అధ్యాపకులు సమ్మెలో ఉన్నారు. కాంట్రాక్ట్ అధ్యాపకుల సమస్యలను పరిష్కరిస్తామని, ఉద్యోగ భద్రత, వేతనాలకు సంబంధించిన జీవోలను త్వరలో జారీ చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చింది. దీంతో కాంట్రాక్ట్ అధ్యాపకుల సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సమ్మెను విరమిస్తున్నట్లు ప్రకటించారు.

ఈ మేరకు పాలమూరు యూనివర్సిటీలో అధికారులు డాక్టర్ చంద్రకిరణ్, డాక్టర్ కృష్ణయ్య కాంట్రాక్ట్ అధ్యాపకులకు నిమ్మరసం ఇచ్చి సమ్మెను విరమింపజేశారు. కార్యక్రమంలో చేగుంటి రవికుమార్, రాఘవేందర్, డాక్టర్ శ్రీధర్, డాక్టర్ భూమయ్య, డాక్టర్ సోమేశ్వర్, డాక్టర్ రవికాంత్, డాక్టర్ కరుణాకర్ రెడ్డి, డాక్టర్ ఎస్ఎన్ అర్జున్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సమయానికి బస్సు ఆపి ఉంటే రెండు ప్రాణాలు దక్కేవి

▸ ఒకే కళాశాల ... రెండు చోట్ల చదువులు
▸ సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ చాంబర్ ముందు బైఠాయించిన విద్యార్థినులు



సమస్యలను అడిగి తెలుసుకుంటున్న ఎస్ఐలు కళ్యాణ్‌కుమార్, శ్రీకాంత్

గద్వాల క్రైం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): రోడ్డుపై నిలుచున్న నర్సింగ్ విద్యార్థినులకు వచ్చిన బస్సు సమయానికి ఆపి ఉంటే రెండు ప్రాణాలు దక్కేవని, తమ స్నేహితులు తమతో హ్యాపీగా ఉండేవారని నర్సింగ్ కళాశాల విద్యార్థినులు ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యలపై వివరిస్తూ... బాధిత కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ బుధవారం కలెక్టరేట్ చాంబర్ ముందు విద్యార్థినులు బైఠాయించి న్యాయం కావాలని గొంతెత్తి అరిచారు. ఈ సందర్భంగా విద్యార్థినులు మాట్లాడుతూ.. కళాశాల వదిలాక ఆ రూట్‌లో వచ్చే బస్సులు ఆపకపోవడంతోనే తమ స్నేహితులు ప్రాణాలు పోగొట్టుకున్నారన్నారు. సమయానికి బస్సు ఆపరు... ఒకవేళ ఆపినట్లే ఆపి వెంటనే ముందుకు తీసుకెళ్లారన్నారు. ఒకవేళ బస్సులు ఆపినా కూడా అక్కడ ఉన్న కండక్టర్లు, డ్రైవర్లు 'మీకు హాస్టల్ దగ్గరే కదా నడుచుకుంటూ వెళ్తే ఏమవుతుంది...? మీకు ఒళ్లు బరువెక్కుతుందా?' అంటూ ఇబ్బందులు పెడుతున్నారని కన్నీటి పర్యం తమయ్యారు. నర్సింగ్ కళాశాల ఉన్నప్పటికీ ఒకటి గంజిపేట కాలనీ సమీపంలో మొదటి, రెండవ సంవత్సరానికి సంబంధించి పాఠాలు చెబుతున్నారన్నారు. పాత ఎస్పీ కార్యాలయం దగ్గర మూడవ, నాల్గవ సంవత్సరం పాఠాలు చెబుతుండటంతో అక్కడి నుంచి హాస్టల్స్‌కు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఈ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అలాగే మృతి చెందిన నర్సింగ్ విద్యార్థినుల కుటుంబాలను ఆర్థికంగా ఆదుకోవాలన్నారు. రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ విద్యార్థినికి మెరుగైన చికిత్సను అందించాలన్నారు. నర్సింగ్ కళాశాల హాస్టళ్లను, కాలేజీని ఒకేచోట ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని, బస్సులు సకాలంలో ఆపాలని డిమాండ్ చేశారు. కలెక్టర్‌తో మాట్లాడేందుకు పట్టణ, రూరల్ ఎస్ఐలు కళ్యాణ్‌కుమార్, శ్రీకాంత్‌లు చర్యలు తీసుకోవడంతో కొందరు విద్యార్థినులు వెళ్లి సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. దీంతో జూలై నాటికి హాస్టల్, కళాశాల ఒకేచోట ఉండేలా చూస్తామని, ప్రస్తుతం ఆర్టీసీ డీఎంతో మాట్లాడి బస్సులు ఆగేలా చూస్తామని, మృతి చెందిన విద్యార్థినుల కుటుంబాలను ఆర్థికంగా ఆదుకుంటామని హామీ ఇవ్వడంతో నిరసన కార్యక్రమాన్ని విరమించారు. అనంతరం కలెక్టరేట్ ఏవో సరేందర్‌కు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు.

బాలల్లారా రారండి.. బాల కేంద్రం పిలుస్తోంది

▸ పేటలో నేడు వేసవి శిబిరం ప్రారంభం
▸ వివిధ కళల్లో చిన్నారులకు శిక్షణ
▸ సూపరింటెండెంట్ మహిపాల్‌రెడ్డి



నారాయణపేటటౌన్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : చిన్నారులకు వివిధ కళల్లో శిక్షణ ఇచ్చేందుకు వేసవి శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు నారాయణపేట బాలకేంద్రం సూపరింటెండెంట్ మహిపాల్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. బాల కేంద్రం చైర్మన్ కలెక్టర్, కన్వీనర్ డీఈవోల సహకారంతో ఈ నెల 1 నుంచి జూన్ 14 వరకు వేసవి శిక్షణ శిబిరం నిర్వహించనున్నట్లు చెప్పారు. ప్రతీ రోజు సాయంత్రం 5 నుంచి 7 గంటల వరకు తరగతులు కొనసాగుతాయని తెలిపారు. 5 నుంచి 14 సంవత్సరాల బాల బాలికలు శిక్షణకు అర్హులను పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న బాల బాలికలు ఆధార్ కార్డు, పాస్‌పోర్ట్ సైజు ఫొటోలతో తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. ఓసీ, బీసీలు రూ. 50, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ. 20 చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. శిబిరంలో చిన్నారులకు సీతార్, తబలా, గాత్రం, కీబోర్డు, రిథం ప్యాడ్, శాస్త్రీయ, జానపద నృత్యాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. శిక్షణా శిబిరాన్ని సద్వినియోగం చేసుకొని చిన్నారులు తమలోని కళా నైపుణ్యాలను పెంచుకోవాలని ఆయన కోరారు.

స్థిరంగా ఉల్లి ధరలు

▸ క్వింటాలుకు గరిష్ఠం రూ. 1700, ▸ కనిష్ఠం రూ. 800



మార్కెట్‌కు వచ్చిన ఉల్లి

దేవరకద్ర, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా, దేవరకద్ర వ్యవసాయ మార్కెట్లో గత నాలుగు వారాలుగా ఉల్లి ధరలు స్థిరంగా కొనసాగుతున్నాయి. గత నెల చివర్లో రూ. 2,500 పలికిన ధర, ఈనెల మొదటి వారం రూ. 1700కు చేరింది. అప్పటి నుంచి అదే ధర కొనసాగుతోంది. మార్కెట్‌కు బుధవారం 250 క్వింటాళ్ల ఉల్లి విక్రయానికి వచ్చింది. క్వింటాలుకు గరిష్ఠంగా రూ. 1700, కనిష్ఠంగా రూ. 800 ధర పలికినట్లు మార్కెట్ కార్యదర్శి జయశ్రీ తెలిపారు. ప్రస్తుతం సీజన్ కొనసాగుతుండటంతో ఉల్లి అధిక మొత్తంలో వస్తోంది. నాణ్యమైన తెల్ల ఉల్లికి డిమాండ్ అధికంగా ఉంది. ఎర్ర ఉల్లిని కొనేవారు కరువయ్యారు. వేలంలో సరైన ధర రాకపోవడంతో పలువురు రైతులు మార్కెట్ బయట నేరుగా వ్యాపారులకు అమ్ముకున్నారు. దీంతో 50 కిలోల బస్తాకు రూ. 850 ధర పలికినట్లు వారు తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో ముగ్గురికి జైలు శిక్ష

నాగర్‌కర్నూల్ క్రైం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : డ్రంకెన్ డ్రైవ్ కేసులో ముగ్గురికి జైలు శిక్ష విధిస్తూ న్యాయాధికారి తీర్పు ఇచ్చినట్లు ఎస్ఐ గోవర్ధన్ తెలిపారు. నాగర్‌కర్నూల్ జిల్లా, బిజినేపల్లి మండలం గంగారం గ్రామానికి చెందిన ఇస్లావత్ రాజు, నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రానికి చెందిన జలగరి పెర్మల్, మంతటి గ్రామానికి చెందిన జాజాల లక్ష్మయ్యలు ఇటీవల మద్యం తాగి వాహనాలు నడుపుతూ పోలీసులకు పట్టుబడ్డారు. బుధవారం వారిని నాగర్‌కర్నూల్ కోర్టులో హాజరు పరిచారు. వారికి ఒక రోజు జైలు శిక్ష, వంద రూపాయల జరిమానా విధిస్తూ జిల్లా ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ జాడ కావ్య తీర్పు వెల్లడించినట్లు ఎస్ఐ తెలిపారు. ఎవరైనా మద్యం తాగి వాహనం నడిపితే కఠిన చర్యలు ఉంటాయని ఆయన హెచ్చరించారు.

న్యూస్ బాక్స్

ధాన్యం కొనుగోలులో ఇబ్బందిలేకుండా చూడాలి

● వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

గద్వాలన్యూటౌన్,ఏప్రిల్30(ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు సునిశితమైన అంశమని, కలెక్టర్లు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ అవాంతరాలు కలుగకుండా చూడాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం యాసంగి ధాన్యం కొనుగోలుపై ఆయన హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్లతో మాట్లాడారు. రానున్న 15-20 రోజులు ధాన్యం కొనుగోళ్లు ఉధృతంగా ఉంటాయని, ఈసమయంలో అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలన్నారు. అన్నిఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. సమావేశంలో కలెక్టర్ బీఎం సంతోష్, అదనపు కలెక్టర్లు లక్ష్మీనారాయణ, నర్సింగరావు, డీఎస్‌వో స్వామికుమార్, అధికారులు ఉన్నారు.

వేతనాలు చెల్లించే వరకు నిరసన

మానవపాడు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): తమకు నాలుగు నెలలుగా వేతనాలు అందడం లేదని మండల కేంద్రంలోని ఉపాధి హామీ పథకం ఉద్యోగులు తెలిపారు. బుధవారం ఎంపీడీవో భాస్కర్‌ను కలిసి సమస్యలపై వినతిపత్రం అందజేశారు. త్వరగా చెల్లించాలని కోరారు. అలాగే నేటి నుంచి (1న) పెన్‌డౌన్ చేస్తామని, 2న ప్రజాభవన్ ఎదుట శాంతియుత నిరసన, 3న ప్రజాప్రతినిధులకు, ముఖ్యమంత్రికి వినతిపత్రం ఇవ్వనున్నట్లు అందులో పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏపీవో విజయ్‌శంకర్, ఉద్యోగులు పరమేశ్, నాగేశ్, వెంకన్న ఉన్నారు.


బాధ్యతలు చేపట్టిన మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్

గద్వాల న్యూటౌన్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్‌గా బుధవారం డాక్టర్ ఎం.నాగేశ్వరావు బాధ్యతలు స్వీకరించారు. సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపి, ఆహ్వానించారు. ఇక్కడ ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహిస్తున్న పార్వతి మహబూబ్‌నగర్‌కు బదిలీఅయ్యారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్లు శ్రీనివాస్, మద్దిలేట్, సూపరింటెండెంట్ పవన్, సిబ్బంది ఉన్నారు.

శ్రీశ్రీది మహా ప్రస్థానమే..

గద్వాల టౌన్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): అభ్యుదయ కవిగా సమాజం మార్పు కోసం సాహిత్య సేవ సాగించిన శ్రీశ్రీది సాహిత్య రంగంలో మహాప్రస్థానమేనని ప్రిన్సిపాల్ డాక్టర్ షేక్ కలందర్‌బాషా కీర్తించారు. పట్టణంలోని మహారాణి ఆదిలక్ష్మి దేవమ్మ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం మహాకవి శ్రీశ్రీ జయంతిని ఘనంగా నిర్వహించారు. దివంగత మహాకవి శ్రీశ్రీ చిత్రపటానికి ప్రిన్సిపాల్, అధ్యాపకులు పూలమాలల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడిన తెలుగు విభాగం హెచ్‌వోడీ మేడిచర్ల నాగభూషణం, కవిగా, సాహితీవేత్తగా అభ్యుదయ రచనలతో శ్రీశ్రీ చేసిన సాహిత్య సేవ గురించి వివరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రమోహన్, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది ఉన్నారు.

దెబ్బతిన్న మిషన్ భగీరథ ఎయిర్ వాల్వ్



బొంకూరులో లీకవుతున్న మిషన్ భగీరథ పైపులైన్

ఉండవల్లి, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బొంకూరులో ఎయిర్ వాల్వ్ దెబ్బతినడంతో మిషన్ భగీరథ తాగునీరు సుమారు 40అడుగుల మేర ఎగిసి పడింది. ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న ఓ ఇంట్లో ఫంక్షన్ జరుగుతున్నందున టెంట్ ఏర్పాటు చేసుకున్నారు. ఆ టెంట్‌కు ఉన్న తాడును పక్కనే ఉన్న మెయిన్ మిషన్ భగీరథ ఎయిర్‌వాల్వ్ గ్రిల్‌కు కట్టి ఉంచారు. కాగా బుధవారం సాయంత్రం విపరీతమైన గాలి వీచడంతో టెంట్‌కు కట్టిన తాడుతో సహా మిషన్ భగీరథ గ్రిల్ లేచిపోయింది. దీంతో తాగునీరు ఎగిసిపడింది.

జడ్జీ నియామక పరీక్షల్లో మెరిసిన గట్టు విద్యార్థిని

గట్టు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): బుధవారం వెలువడిన జూనియర్ సివిల్ జడ్జి నియామక ఫలితాల్లో గట్టుకు చెందిన సంఘం స్వర్ణ మల్లిక జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికయ్యారు. ఆమెతండ్రి సంఘం సురేశ్ గద్వాలలో న్యాయవాది. గట్టు మండలం నుంచి జడ్జిగా ఎంపిక అవడంతో ఆమెకు పలువురు అభినందనలు తెలిపారు.

నేడు క్రీడా సంఘాల ప్రతినిధులతో సమావేశం

గద్వాలఅర్బన్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో మే 1న గురువారం ఉదయం స్థానిక ఇండోర్ స్టేడియం గ్రౌండ్‌లో నిర్వహించే వేసవి క్రీడా శిక్షణ శిబిరానికి జిల్లాలోని వ్యాయామ ఉపాధ్యాయులు, విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాసంఘాల ప్రతినిధులతో సమావేశం నిర్వహిస్తున్నట్లు డీవైఎస్‌వో పి.జితేందర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

లింగవివక్షను వ్యతిరేకించిన బసవేశ్వరుడు



గద్వాలలో బసవేశ్వరుని చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వీరశైవ సంఘం నాయకులు



గట్టులో బసవేశ్వరుని చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న బీజేపీ నాయకులు

ఘనంగా బసవేశ్వర జయంతి

గద్వాల న్యూటౌన్, ఏప్రిల్ 39(ఆంధ్రజ్యోతి): సమాజంలో కుల, వర్ణ, లింగ వివక్షతను వ్యతిరేకించిన గొప్పఅభ్యుదయవాది బసవేశ్వరుడు అని కలెక్టర్ బీఎం సంతోష్ తెలిపారు. బుధవారం ఐడీవోసీ కార్యాలయ ఆవరణలో బీసీ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన బసవేశ్వర జయంతి కార్యక్రమంలో కలెక్టర్ బీఎం సంతోష్ పాల్గొని బసవేశ్వర చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ, ఆర్డీవో శ్రీనివాసరావు, బీసీ సంక్షేమశాఖ అధికారి రమేశ్‌బాబు, ఏవో నరేందర్, అధికారులు ఉన్నారు.

● గద్వాలటౌన్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): కులవ్యవస్థ నిర్మూలనకు 12వ శతాబ్దంలోనే పునాది వేసిన బసవేశ్వరుడు సంఘసంస్కర్త అని వీరశైవ సంఘం, వీరశైవ మహిళా సమాజం బాధ్యులు కీర్తించారు. బుధవారం పట్టణంలోని భద్రకాళి సమేత వీరభద్రస్వామి ఆలయంలో బసవేశ్వరుని చిత్రపటానికి వీరశైవ సంఘం అధ్యక్షుడు రమేశ్, కార్యదర్శి విజయ్, లింగ బలిజ సంఘం జిల్లా అధ్యక్షుడు సురేశ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఈరమ్మ, లక్ష్మి, సుజాత, బసవరాజు, సాంబశివుడు, విశ్వనాథ్, పరమేశ్వరయ్య, దలాలి బస్వరాజ్, బసవరాజ్ స్వామి, రమేశ్ ఉన్నారు.

● గట్టు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి):బసవేశ్వర జయంతిని తహసీల్దార్ కార్యాలయంతోపాటు గట్టు గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. బసవేశ్వరుడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో నయాబ్ తహసీల్దార్ విజయ్, రాజుగౌడ, గాజులు సంతోశ్, గూడూరు నాగప్ప, మఠం నాగయ్య, వీరేశ్, సంఘం సుధీర్ ఉన్నారు.

● ఇటిక్యాల: తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం బసవేశ్వరస్వామి జయంతి వేడుకలు తహసీల్దార్ వీరబద్రప్ప ఆధ్వర్యంలో నిర్వహించారు. బసవేశ్వరస్వామి చిత్రపటానికి పూలమాల వేసి నివాళిఅర్పించారు.

● అయిజ : పట్టణంలోని బలిజపేట వీధిలోని బసవేశ్వర ఆలయం నుంచి వీరశైవ సభ్యులు ద్విచక్ర వాహన ర్యాలీ చేశారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ జ్యోతి బసవేశ్వర చిత్రపటానికి పూలమాల వేసి నివాళిఅర్పించారు. కార్యక్రమంలో అశోక్, పీజే మల్లికార్జున్, శివరాజ్, నాగరాజు, నాగరాజు, వినయ్ ఉన్నారు.

● మల్దకల్ : మండల కేంద్రంలో బసవేశ్వర చిత్రపటానికి వీరశైవ సంఘం అధ్యక్షుడు మఠం రాజశేఖర్ పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వీరశైవులు ఉన్నారు.

టెన్త్ ఫలితాల్లో సత్తాచాటిన ప్రైవేట్ పాఠశాలలు



అఫ్రానాజ్, విశ్వభారతి స్కూల్



నాగరాజు, విశ్వభారతి స్కూల్



సాయిశంకర్‌గౌడ్, అక్షర స్కూల్



అరవింద్, అక్షర స్కూల్



శివాని, ప్రగతి స్కూల్



అక్షిత, శ్రీసరస్వతి స్కూల్

గద్వాలసర్కిల్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి ఫలితాల్లో జిల్లా కేంద్రం గద్వాలలోని పలు ప్రైవేట్ పాఠశాలలు తమ సత్తా చాటాయి. విశ్వభారతి ఉన్నత పాఠశాల విద్యార్థులు అఫ్రానాజ్ 587మార్కులతో జిల్లా ప్రథమ స్థానంలో నిలువగా, నాగరాజు 580, వసీం అక్రం 578, వీరమ్మ 576 నాష్రా ఫాతిమా 573, మనీష్‌కుమార్ 572, సంజయ్ 571 మార్కులు సాధించినట్లు పాఠశాల కరస్పాండెంట్ త్యాగరాజు, హెచ్‌ఎం తిరుమలేశ్ తెలి పారు. అక్షర ఉన్నత పాఠశాల విద్యార్థులు సాయిశంకర్‌గౌడ్ 565 మార్కులు, అరవింద్ 562, స్నేహ 534 మార్కులు సాధించారని కరస్పాండెంట్ శ్రీధర్, ప్రిన్సిపల్ రత్నం తెలిపారు. ప్రగతి ఉన్నత పాఠశాలకు చెందిన శివాని 562 మార్కులు సాధించారని కరస్పాండెంట్ సవారన్న తెలిపారు. శ్రీసరస్వతి ఉన్నత పాఠశాలకు చెందిన అక్షిత 558 మార్కులు, రాంచరణ్ 552, శివాజి 551, అఖిలేష్ 546, రాణి 542, గాయత్రి 539 మార్కులు సాధించినట్లు కరస్పాండెంట్ మాకం బీచుపల్లి తెలిపారు.

61 పాఠశాలల్లో వందశాతం ఫలితాలు

● ఫలితాల మెరుగునకు కృషి చేసిన వారికి విద్యార్థులకు కలెక్టర్ అభినందనలు

గద్వాల సర్కిల్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి ఫలితాల్లో జిల్లాలోని వివిధ కేటగిరీలకు చెందిన 61 ప్రభుత్వ, జడ్పీహెచ్‌ఎస్, మైనార్టీ, గురుకులం, కేజీబీవీ, బీసీ వెల్ఫేర్, ఎయిడెడ్ ప్రైవేట్ తదితర పాఠశాలలు శత శాతం ఉత్తీర్ణత సాధించాయి. వాటిలో ప్రభుత్వ పాఠశాల 1, జడ్పీహెచ్‌ఎస్ 17, కేజీబీవీ 5, బీసీ వేల్ఫేర్ 4, మైనార్టీ రెసిడెన్షియల్ 1, సోషల్ వేల్ఫేర్ 3, ప్రైవేట్ పాఠశాలలు 30 ఉన్నాయి. కాగా 91.74 శాతం ఉత్తీర్ణతతో రాష్ట్ర స్థాయిలో 26వ స్థానం సాధించడంతో పాటు 61 పాఠశాలల్లో వందశాతం ఫలితాలు సాధించడం పట్ల కలెక్టర్ సంతోష్ ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఫలితాల మెరుగునకు కృషి చేసిన హెచ్‌ఎం, ఉపాధ్యాయులను, ఆయా పాఠశాలల ప్రిన్సిపాల్స్, యాజమన్యాలను, ప్రతిభతో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు.

● పదో తరగతి ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించిన విద్యార్థులు తమ ప్రతిభచాటారు. గద్వాలలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ఉన్నత పాఠశాల విద్యార్థినులు అక్షయ 566 మార్కులు, అఖిలా బాయి 549, అరవింద 548 మార్కులు సాధించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ మైనార్టీ బాలికల విద్యాలయ విద్యార్థినిలు నాజీయా 565 మార్కులు, సుమతి 545, తస్లీం 545, ప్రశాంతి 545, హరి కీర్తన 543 మార్కులు సాధించారు. ప్రభుత్వ అభ్యసన ఉన్నత పాఠశాల విద్యార్థులు శివశంకర్ 555 మార్కులు, ఆసియా 552, లక్ష్మి 546, మౌనిక 535 మార్కులు సాధించారు.

● మానవపాడు, ఏప్రిల్30 (ఆంధ్రజ్యోతి): మానవపాడు పాఠశాలలో 72మంది విద్యార్థులకు 65మంది పాసయ్యారు. వారిలో నక్షత్ర 520, రోష్ని 492, షాజీయా తహసీన్ 487 మార్కులు సాధించారు. చెన్నిపాడు 28మంది విద్యార్థుల్లో 25పాసయ్యారు. వారిలో మౌనిక 468, హర్ష 438, గాయిత్రి 429 సాధించారు. జల్లాపురం 67మందికిగానూ 65మంది పాసయ్యారు. వారిలో గౌతమిరెడ్డి 514, వైష్ణవి 509, రాము 504 మార్కులు సాధించారు. కేజీబీవీలో సునిత 527, విజేత 503, నందిని 495 మార్కులు సాధించారు.

● **గురుకులాల ప్రతిభ**

అలంపూరు చౌరస్తా, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): పది ఫలితాలలో గురుకులాల విద్యార్థులు ప్రతిభ చాటారు. ఉండవల్లి మండలం పుల్లూరు మహాత్మా జ్యోతిబాపూలే (ఎంజేపీ) బాలికల పాఠశాలలో వందశాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ దేవానందం తెలిపారు. 68మందికి 68ఉత్తీర్ణత సాధించారని, వారిలో జి.భార్గవి 558/600, డి.శ్రీలేఖ 552, కె.నందిని 547మార్కులు సాధించారని తెలిపారు. 500కుపైగా 25మంది మార్కులు సాధించారని తెలిపారు. బైరపురం, శాంతినగర్ ఎంజేపీ బాలుర, బొంకూరు ఉన్నతపాఠశాలలు వందశాతం సాధించగా విశ్వశాంతి హైస్కూల్ వందశాతం ఉత్తీర్ణత సాధించాయి. ఇక కేజీబీవీ ఉండవల్లి 96శాతం, పుల్లూరు ఉన్నత పాఠశాల 88.57శాతం, తక్షశిల 91.2శాతం, ఉండవల్లి 95.7శాతం సాధించినట్లు ఎంఈవో రామకృష్ణ తెలిపారు.

● అయిజ, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): అయిజ మండల ప్రభుత్వ విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. కస్తూర్బాతో కలుపుకుని 12 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలున్నాయి. ఉత్తనూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 75మందికి గానూ 73మంది ఉత్తీర్ణులయ్యారు. 97శాతం సాధించామని ప్రధానోపాధ్యాయులు సోమశేఖర్‌రెడ్డి తెలిపారు. పులికల్ ప్రభుత్వ ఉన్నతపాఠశాలలో 33మందికి 32మంది ఉతీర్ణులయ్యారని, 97శాతం సాధించామని హెచ్‌ఎం ఉషారాణి తెలిపారు.

● **ఇటిక్యాలలో 95.5శాతం ఉత్తీర్ణత**

ఇటిక్యాల, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని జడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులు 95.5 శాతం ఉత్తీర్ణత సాధించారని ఎంఈవో వెంకటేశ్వర్లు తెలిపారు.వావిలాల, మునగాల, ఉదండాపురం, సాతర్ల జడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారన్నారు. ఇటిక్యాల, చాగాపురం పాఠశాలలో 100శాతం ఉత్తీర్ణత సాధించగా, ఇటిక్యాల గురుకుల పాఠశాల విద్యార్థి కె. జశ్వంత్ 569మార్కులతో మండల టాపర్‌గా నిలిచాడు. కె.మల్లికార్జున్ 542మార్కులు సాధించినట్లు ప్రిన్సిపాల్ సురేశ్ తెలిపారు.

● ఎర్రవల్లి, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): మండల టాపర్‌గా బీచుపల్లి గురుకుల పాఠశాల విద్యార్థులు మధుబాబు 550మార్కులు, మెఘావత్ శివ 548 మార్కులు సాధించి ద్వితీయ స్థానంలో నిలిచారు. జడ్పీహెచ్‌ఎస్ వల్లూరుకు చెందిన రఘునాథ్ 521మార్కులు సాధించినట్లు తెలిపారు. మండల వ్యాప్తంగా 96.9శాతం ఉత్తీర్ణత సాధించారని అధికారులు తెలిపారు. వీరాపురం, వేముల, కేజీబీవీ, అయిజ గురుకుల పాఠశాల, సాయుధ చైతన్య పాఠశాలలు వందశాతం ఉత్తీరత సాధించారని మండల విద్యాధికారి అమీర్‌పాష తెలిపారు.

● **ధరూరులో 75.87 శాతం ఉత్తీర్ణత**

ధరూరు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి):మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో 75.87శాతం ఉత్తీర్ణత సాధించాయని ఎంఈవో రవీంద్రబాబు తెలిపారు. జడ్పీహెచ్‌ఎస్ రేవులపల్లి, ఎంపీహెచ్‌ఎస్ గార్లపాడు పాఠశాలల్లో వందశాతం ఫలితాలు సాధించారన్నారు. జడ్పీహెచ్ ఉప్పేరులో 93శాతం, ధరూర్‌లో 75శాతం, మార్లబీడులో 87శాతం, ఎంపీహెచ్‌ఎస్ అల్వాల్‌పాడులో 96శాతం, కేజీబీవీ ధరూర్‌లో 98 ఫలితాలు సాధించాలయని తెలిపారు. ధరూరు జడ్పీహెచ్‌ఎస్‌లో అత్యధికంగా సుహానాసిద్ర 530 మార్కులు, నవిత 521 మార్కులు సాధించారని తెలిపారు.

● **గట్టులో 95శాతం ఉత్తీర్ణత**

గట్టు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి):మండలంలో 95శాతం ఉత్తీర్ణత లభించిందని మండల విద్యాధికారి నల్లారెడ్డి తెలిపారు. మండలంలో మొత్తం 561మంది విద్యార్థులు పరీక్షలు రాయగా ఇందులో 534మంది ఉత్తీర్ణత సాధించారని చెప్పారు. గట్టు జడ్పీ ఉన్నత పాఠశాలలో 70మంది పరీక్షలు రాయగా 68 మంది, ఆరగిద్దలో 27 మందికి 26మంది, గట్టు గురుకుల పాఠశాలలో 77మందికి 77మంది ఉత్తీర్ణులయ్యారు. ఇందువాసి జడ్పీహెచ్‌ఎస్‌లో 16మందికి 16మంది ఉత్తీర్ణులయ్యారు. గోర్లఖాన్‌దొడ్డిలో 26మందికి 23మంది, గట్టు కేజీబీవీలో 44మందికి 44మంది ఉత్తీర్ణత సాధించారు. బోయలగుడ్డం ఎంపీహెచ్‌ఎస్‌లో 17కు 17మంది, తప్పెట్లమొర్సులో 19మంది పరీక్షలు రాయగా 19మంది ఉత్తీర్ణులయ్యారు.ఆలురులో 66మందికి 48మంది, జడ్పీహెచ్‌ఎస్ మాచర్లలో 93మందికి 90మంది, చాగదోణ జడ్పీహెచ్‌ఎస్‌లో 28మందికి 28 మంది ఉత్తీర్ణులయ్యారు. మాచర్లకు చెందిన ఇంద్రజ 529 మార్కులు, బాలికల గురుకుల పాఠశాలకు చెందిన అక్షయ 576 మార్కులతో మండల టాపర్లుగా నిలిచారని తెలిపారు.

● **మల్దకల్‌లో 78.92 శాతం**

మల్దకల్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి):మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో 78.92శాతం ఉత్తీర్ణత సాధించాయని ఎంఈవో సురేష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 408మంది విద్యార్థులకు 322 మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. మద్దెలబండ జడ్పీహెచ్‌ఎస్ పాఠశాల విద్యార్థిని 514మార్కులు, ఎల్కూరు జడ్పీహెచ్‌ఎస్ విద్యార్థి సాయికిరణ్‌రెడ్డి 496 (ఈఎం) మార్కులు సాధించారని తెలిపారు. జడ్పీహెచ్‌ఎస్ మల్దకల్ 81.44 శాతం, అమరవాయి 87.50శాతం, పాల్వాయి 92.85శాతం, ఎల్కూరు 71శాతం, విఠలాపురం 82 శాతం, బిజ్వారం 64.70శాతం, ఎంపీహెచ్‌ఎస్ తాటికుంట 53.33శాతం, జడ్పీహెచ్‌ఎస్ మద్దెలబండ 85శాతం, కుర్తిరావులచెరువు 83.30 శాతం, కేజీబీవీ మల్దకల్ 93.54శాతం ఉత్తీర్ణత సాధించాయన్నారు.

● **రాజోలిలో 84.11 శాతం ఉత్తీర్ణత**

రాజోలి, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ విద్యాశాఖ అధికారులు విడుదల చేసిన పదవ తరగతి ఫలితాల్లో రాజోలి మండలంలో 84.11 శాతం ఉత్తీర్ణత సాధించారు. మాన్‌దొడ్డి గ్రామంకు చెందిన పరుశ అనే విద్యార్థి 566 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచాడు. రాజోలి జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో 531 మార్కులు సాధించి రాజోలి చెందిన చందు అనే విద్యార్థిని రెండవ స్థానం సాధించారు. రాజోలి మండలంలోని మొత్తం 258 మంది విద్యార్థులు 10వ తరగతి పరిక్షలు రాయగా, 217 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని, రాజోలి ఉర్దూ పాఠశాలలో విద్యార్థులు 100శాతం, కేజీబీవీ పాఠశాల విద్యార్థులు 100 శాతం సత్యం స్కూల్ విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించారు. రాజోలి జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో 98 విద్యార్థులకు గాను 72 మంది ఉత్తీర్ణత సాధించారని ఎంఈవో భగీరథ రెడ్డి తెలిపారు.

గురుకుల విద్యార్థుల ప్రతిభ

● కేటీదొడ్డి, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): కేటీదొడ్డి మండలంలోని మహాత్మా జ్యోతి బాపూలే గురుకుల పాఠశాల విద్యార్థులు బుధవారం వెలువడిన టెన్త్ ఫలితాల్లో తమ ప్రతిభ కనబరిచారు. మహాత్మ జ్యోతి బాపూలే పాఠశాలలో 78 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 78మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించడంతో పాటు 28 మంది విద్యార్థులు 500పైగా మార్కులు సాధించారు. అందులో దేశంలో వెనుకబడిన గట్టు మండలంలోని చాగదొణ గ్రామంలో నిరుపేద కుటుంబంలో యస్.మార్క్, శోభకు జన్మించిన యస్.చరణ్ 574 మార్కులతో రాష్ట్రస్థాయి ర్యాంక్‌ను సాధించి ఆదర్శంగా నిలిచాడు. అలాగే పి.చరణ్‌కుమార్‌రెడ్డి 568 మార్కులతో పాఠశాల రెండవ ర్యాంకర్‌గా నిలిచి విజయకేతనం ఎగురవేసిన సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ కే.శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ బి.సుధాకర్ పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది హర్షం వ్యక్తం చేస్తూ విద్యార్థుల తల్లిదండ్రులకు శుభాకాంక్షలు తెలిపారు.

విధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- శాంతినగర్ పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసిన ఎస్పీ శ్రీనివాసరావు



శాంతినగర్ పీఎస్‌లో రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ శ్రీనివాసరావు

వడ్డేపల్లి, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): పోలీసు సిబ్బంది నిరంతరం విధుల పట్ల అప్రమత్తంగా ఉంటూ స్టేషన్‌కు వచ్చే బాధితులకు తక్షణమే న్యాయం చేయాలని ఎస్పీ శ్రీనివాసరావు అన్నారు. స్టేషన్ పరిసరాలను ఆహ్లాదకరమైన వాతావరణం ఉండేలా చూడాలని, అత్యవసర పరిస్థితుల్లో వినియోగించేడయల్-100 కాల్స్‌కు వెంటనే స్పందించాలని సిబ్బందికి సూచించారు. శాంతినగర్ పోలీస్‌స్టేషన్‌ను ఎస్పీ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను, పరిసరాలను, సిబ్బంది విధులను పరిశీలించారు. సీసీ కెమెరాల పనితీరును, జనరల్ డైరీ, బీట్‌డ్యూటీ బుక్స్ సుపీరియర్ ఆఫీసర్స్ విజిటింగ్ బుక్స్ తదితర రికార్డులను పరిశీలించారు. అనంతరం ఎస్పీ స్టేషన్ సిబ్బందితో మాట్లాడుతూ స్టేషన్ పరిసరాలను నిత్యం పరిశుభ్రంగా ఉంచుకోవాలని, స్టాఫ్‌కు ఏమైనా సమస్యలు ఉంటే తనదృష్టికి తెచ్చి పరిష్కరించుకోవాలని సూచించారు. పలు సూచనలు చేశారు. డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టి రోడ్డు ప్రమాదాలను నియంత్రించాలన్నారు. డయల్ 100కు కాల్ రాగానే వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని సమస్య పరిష్కరించాలని, బ్లూకోల్ట్స్, పెట్రోల్ కార్ నిరంతరం గస్తీ నిర్వహించాలన్నారు. సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలపై మూఢనమ్మకాలు, బాల్య వివాహాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఎస్పీ సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో డీఎస్పీ మొగులయ్య, సీఐ టాటాబాబు, ఎస్‌ఐ నాగశేఖర్‌రెడ్డి ఉన్నారు.

అంకితభావంతోనే పని చేస్తేనే గుర్తింపు : ఎస్పీ

- ఉద్యోగ విరమణ పొందిన పదో బెటాలియన్ కమాండెంట్, ఏఎస్ఐ

ఎర్రవల్లి, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) అంకిత భావంతోనే పని చేస్తేనే ప్రతీఉద్యోగికి గుర్తింపు లభిస్తుందని ఎస్పీ శ్రీనివాసరావు అన్నారు. ఎర్రవల్లిలోని పదో బెటాలియన్ కమాండెంట్ సాంబయ్య ఉద్యోగ విరమణ కార్యక్రమానికి ఎస్పీతో పాటు మరికొందరు బెటాలియన్ ఉన్నతాధికారులు హాజరయ్యారు. సాంబయ్య దంపతులను ఘనంగా సన్మానించి మాట్లాడారు. కార్యక్రమంలో రిటైర్డ్, అడిషనల్, అసిస్టెంట్ కమాండెంట్లు, ఆర్ఎస్ఐలు పాల్గొన్నారు.

● **శేష జీవితం ఆనందంగా గడపాలి**

గద్వాల క్రైం : పదవీ విరమణ పొందిన పోలీస్ అధికారులు తమ శేష జీవితాన్ని కుటుంబ సభ్యులు, స్నేహితులతో ఆనందంగా గడపాలని ఎస్పీ శ్రీనివాసరావు అన్నారు. జిల్లాలో సుమారుగా 36ఏళ్లు వివిధ హోదాల్లో పనిచేసి బుధవారం ఉద్యోగ విరమణ పొందుతున్న ఉండవల్లి పోలీస్ స్టేషన్‌లో ఏఎస్‌ఐ సుబ్బారెడ్డి దంపతులను ఎస్పీ జిల్లా కేంద్రంలోని తన చాంబర్‌లో ఘనంగా సన్మానించారు. రిటైర్డ్‌మెంట్ బెనిఫిట్ పత్రాలను అందజేశారు.ఇకపై కుటుంబ సభ్యులతో ఆనందంగా వారి శేషజీవితం ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో గడపాలని ఆకాంక్షించారు.

కార్యక్రమంలో డీఎస్పీ మొగుల య్య, కార్యాలయ ఏవో సతీష్‌కుమార్, అలంపూ ర్ సీఐ రవిబాబు, ఉండవల్లి ఎస్ఐ మహేశ్, డీసీఆర్బీ ఎస్ఐ షుకూర్ ఉన్నారు.

మరణించిన విద్యార్థినుల కుటుంబాలను ఆదుకోవాలి

- అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించిన బీజేపీ నాయకులు
- విద్యార్థినుల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఎమ్మెల్యే సతీమణి బండ్ల జ్యోతి నివాళి

గద్వాల క్రైం, ఏప్రిల్30 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని కొత్తహౌసింగ్ బోర్డు టర్నింగ్ పాయింట్ దగ్గర బొలెరో వాహన ప్రమాదంలో మృతిచెందిన నర్సింగ్ విద్యార్థినులకు బుధవారం నర్సింగ్ కళాశాలలో సంతాపసభ నిర్వహించారు. ఈ సందర్భంగా బండ్ల జ్యోతి హాజరై విద్యార్థినుల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పిం చారు. వారి ఆత్మకు శాంతి కలగాలని భగవంతున్ని ప్రార్థించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ....నర్సింగ్ కళాశాల విద్యార్థినులైన మల్లేశ్వరి, మనీషాలకు ప్రమాదం జరిగి మృతి చెందడం బాధాకరమన్నారు. వారిలోటును కుటుంబానికి పూరించలేమన్నారు. మంచి భవిష్యత్తు ఉన్న విద్యార్థులు కళ్లముందే విగత జీవులుగా చూడలేక పోయామని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రిన్సిపల్, లెక్చరర్లు కంటతడి పెట్టడం చాలాబాధగా ఉందని, తోటి విద్యార్థులు తోటి విద్యార్థినులను కోల్పోయామని చెప్పడం కష్టంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ డైరెక్టర్ రాధారెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు ఉన్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలని వినతి

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన నర్సింగ్ కళాశాల విద్యార్థినుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి డి.కె. స్నిగ్ధారెడ్డి అన్నారు. బుధవారం బీజేపీ పట్టణాధ్యక్షురాలు రజక జయశ్రీ ఆధ్వర్యంలో అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణకు వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ ఘటనకు ప్రధాన కారణం ట్రాఫిక్ కంట్రోల్ లేకపోవడమే అని ప్రజలు చర్చించుకుంటున్నారన్నారు. రోడ్డుకు అడ్డంగా అనేక చిరువ్యాపారుల బండ్లు, ఫ్లెక్సీలు వెలిశాయన్నారు. ప్రమాదాలకు గురౌతున్న ప్రాంతాలను గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు, నాయకులు దేవదాసు, అక్కల రమాసాయిబాబ, రజక జయశ్రీ, రజక నర్సింహులు, వెంకటేశ్, నర్సింహులు ఉన్నారు. అనంతరం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినిని పరామర్శించి మెరుగైన వైద్యచికిత్సలు అందించాలని డాక్టర్లకు సూచించారు.

● అయిజ, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): మరణించిన విద్యార్థినుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని బీఆర్ఎస్వీ జిల్లా కోఆర్డినేటర్ కురువ పల్లయ్య డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం విద్యార్థినులకు ప్రత్యేక బస్సు సౌకర్యం కల్పించని కారణంగానే ప్రాణాలు కోల్పోయాయని తెలిపారు. ప్రభుత్వం బాధ్యత వహిస్తూ బాధిత కుటుంబాలకు రూ.50 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్వీ నాయకులు వీరేష్, తులసిగౌడ్‌లు పాల్గొన్నారు.

అయిజ తైబజార్ వేలంపాట రూ.21.48లక్షలు

- నాలుగేళ్ల తరువాత నిర్వహణ



వేలం పాటను ఖరారు చేస్తున్న కమిషనర్ సైదులు

అయిజటౌన్,ఏప్రిల్30 (ఆంధ్రజ్యోతి): అయిజ మున్సిపాలిటీలో తైబజారు వేలంపాటను బుధవారం కమిషనర్ సైదులు ఖరారు చేశారు. నాలుగేళ్లుగా పాలకవర్గం ఆమోదంలేక, ప్రతిపక్షాల అభ్యంతరం మూలంగా నిలిచిన తైబజారు వేలంపాటను ఎట్టకేలకు అధికారులు నిర్వహించారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి(11నెలలకు) తైబజారు వేలంపాటను పట్టణానికి చెందిన వీ.రవీందర్ దక్కించుకున్నారు. ఏప్రిల్ 25వ, తేదీ నుంచి 29వ తేదీ వరకు డీడీలు స్వీకరించగా, ఇద్దరు గుత్తేదారులు మాత్రమే ధరావత్ డీడీ సొమ్మును చెల్లించి వేలంపాటలో పాల్గొన్నారు. దీంతో పాటు కూరగాయల మార్కెట్ వేలంపాటకు కూడా దరఖాస్తులు కోరినప్పటికీ ఒక్కరు కూడా ధరావత్ సొమ్ము చెల్లించి వేలంపాటలో పాల్గొనలేదు. దీంతో అధికారులు కూరగాయల మార్కెట్ వేలంపాటను వాయిదావేశారు. కాగా తైబజారు వేలంపాట గురువారం నుంచి అమల్లోకి వస్తున్నట్లు కమిషనర్ తెలిపారు.

గ్రామాల్లో పారిశుధ్యంపై దృష్టి సారించాలి

● అదనపు కలెక్టర్ నర్సింగరావు

గద్వాలన్యూటౌన్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో స్వచ్ఛమైన తాగునీరు, పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని అదనపు కలెక్టర్ నర్సింగరావు అధికారులను ఆదేశించారు. బుధవారం ఐడీవోసీ కాన్ఫరెన్స్ హాలులో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో బహిరంగ మలవిసర్జన పూర్తిగా నిర్మూలించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలు ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రతీ గ్రామంలో నీటినాణ్యతను క్రమం తప్పకుండా పరీక్షించి అవసరమైన ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలోని అన్ని గ్రామపంచాయతీల్లో ఇంకుడుగుంతలు ఏర్పాటు చేసుకునే విధంగా అవగాహన కల్పించాలన్నారు. ఇంకొక గుంతల వల్ల భూగర్భజలాలు పెరుగుతాయని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలు, ఆస్పత్రులు, ఇతర ప్రభుత్వ భవనాల్లో రూఫ్‌టాప్ హార్వెస్టింగ్ ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందించాలన్నారు. పాత బోర్ల రిచార్జింగా ద్వారా భూగర్భజలాలను పెంపొందించే విధంగా వ్యవసాయ అధికారులు పనిచేయాలన్నారు. కెనాల్స్ చెరువుల పునరుద్ధరణపై దృష్టి పెట్టాలని ఇరిగేషన్ అధికారులకు సూచించారు. ప్లాస్టిక్ నియంత్రణకు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో మిషన్ భగీరథ ఇంట్రా ఈఈ శ్రీధర్‌రెడ్డి, నీటిపారుదల శాఖా ఈఈ శ్రీనివాసరావు, వైద్య శాఖ ప్రోగ్రాం అధికారి సంధ్యాకిరణ్మయి, కమిటీ సభ్యులు ఉన్నారు.

వివక్ష పాటించరాదు : తహసీల్దార్

గట్టు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): గ్రామంలో అందరూ తారతమ్యాలు లేకుండా సోదర భావంతో మెలగాలని తహసీల్దార్ సలీముద్దిన్ సూచించారు. మండల పరిధిలోని సల్కాపురం గ్రామ పంచాయతీలో బుధవారం పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తహసీల్దార్ సలీముద్దిన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా పలు విషయాలను గ్రామస్థుల ద్వారా అధికారులు చర్చించారు. ఆలయ ప్రవేశం, కుల వివక్ష, మహిళలపై దౌర్జన్యం, రెండు గ్లాసుల పద్ధతి వంటి వాటిపై గ్రామస్థులతో చర్చించారు. గ్రామంలో అందరూ కలిసిమెలిసి జీవనం సాగించాలని, వివక్ష పాటించరాదని అన్నారు. అంటరానితనం నేరమన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ రాజు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.